సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 10 । జూన్ । 2023



గోరంత అనుమతి.. కొండంత తవ్వకం

పెద్దతిప్పసముద్రం మండలంలో అనధికారికంగా తవ్వకాలు చేపడుతున్నా గనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. -8లో



అదుపుతప్పి.. వాహనాలపైకి దూసుకెళ్లి..

కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో పాలవ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.280	రూ.360
రెండోరకం	రూ.180	రూ.270



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1494 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	440	440
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 55.26 కిలోలు

న్యూస్‌రీల్

14న జెడ్పీ స్టాండింగ్ కమిటీల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశం ఈనెల 14వ తేదీ ఉదయం 9.00 గంటలకు కడప జెడ్పీ కార్యాలయంలో జరుగుతుందని ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఈ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు. జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు స్టాండింగ్ కమిటీ సమావేశానికి నిర్దేశించిన సమయం కంటే ఒక గంట ముందు రావాలని కోరారు. అధికారులు తమ శాఖాపరమైన ప్రగతి నివేదికలు, సంబంధిత సమాచారంతో హాజరు కావాలన్నారు.

గుండ్లచెరువు వాటర్‌షెడ్ పనుల పరిశీలన



గుండ్లచెరువులో వైఎస్సార్ రాజన్న అమృత్ సరోవర్ కొత్త కుంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గాలివీడు: మండల పరిధిలోని గుండ్లచెరువు వాటర్ షెడ్, ఉపాధి పనులను కేంద్ర బృందం జిల్లా అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పనుల పరిశీలన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే అరవీడు కదిరప్పకుంట, గోరాన్‌చెరువు, పెద్ద చెరువు, గుండ్లచెరువు, వైఎస్సార్ రాజన్నకుంట అమృత్ సరోవర్ , కొర్లకుంట తూపల్లెచెరువును కూడా వారు పరిశీలించారు. కార్యక్రమంలో పీడీ మద్దిలేటి, ఏపీడీ రెడ్డయ్యానాయుడు, వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు ఉమా ప్రభాకర్, దీప్తి వెంకటాద్రి, వాటర్ షెడ్ చైర్మన్ బండి బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేమన విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన



వేమన విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఉన్న వేమన విగ్రహ నిర్మాణ పనులను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పరిశీలించారు. విగ్రహం ఎత్తు పెంచడంతో పాటు, ఆకర్షణీయంగా రూపొందించాలని, సౌకర్యవంతంగా మెట్లు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఇంజినీర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూమిని అంతర్ పంటలతో కప్పి ఉంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు చీఫ్ సెక్రటరీ విజయ్‌కుమార్

కడప అగ్రికల్చర్: రైతులందరూ తమ భూమిని 365 రోజులు వివిధ అంతర్ పంటలతో కప్పి ఉంచుకోవాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ అండ్ ఎక్స్‌అఫిషియో, రిటైర్డు చీఫ్ సెక్రటరీ విజయ్‌కుమార్ అన్నారు. ఇలా కప్పి ఉంచడం వల్ల భూతాపం తగ్గి సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెందుతాయన్నారు. శుక్రవారం కడప కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నెలవారి కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణతను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

వేధిస్తున్న స్టాంపుల కొరత

కడప కోటిరెడ్డిసర్కిల్:జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత వేధిస్తోంది. దాదాపు 10-20 రోజులుగా రూ. 100, రూ. 50 విలువైన స్టాంపులు లభ్యం కాకపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలియవచ్చింది. దీంతో స్థిరాస్తుల క్రయ, విక్రయదారులు స్టాంపుల కోసం ఇతర జిల్లాలకు పరుగులు పెడుతున్నారు.

ఈ-స్టాపింగ్‌పై దృష్టి

స్టాంపుల కొరతను తగ్గించేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. జిల్లాలోని కొందరు స్టాంప్ వెండర్లకు ఈ-స్టాపింగ్ లైసెన్సులను జారీ చేస్తున్నారు. దీనిపై వినియోగదారుల్లో చైతన్యం కల్పిస్తున్నారు.

ఉద్యోగులకు ఉషోదయం

- సీపీఎస్ రద్దుతో మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి
- సీపీఎస్ కంటే మెరుగ్గా జీపీఎస్
- ఉద్యోగ వర్గాలకు వరుస ప్రయోజనాలే ప్రభుత్వ సంకల్పం
- ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు



సాక్షి రాయచోటి: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న వైఎస్సార్‌సీపీ సర్కార్ ఉద్యోగులకు మంచి చేయాలని సంకల్పించింది. ఒకవైపు ఎంఐజీ లే అవుట్లలో రాయితీ కల్పించడమే కాకుండా మరోవైపు వారి ప్రయోజనాలను పెద్ద ఎత్తున నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వరుసగా పెండింగ్ బకాయిలను చెల్లిస్తూ వస్తున్న ప్రభుత్వం.. ఇటీవలే ఉపాధ్యాయుల బదిలీలకు పచ్చజెండా ఊపింది. అంతే కాకుండా అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారులుగా పదోన్నతులు కల్పించింది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ లోకానికి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీపి కబురు అందించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేస్తామని ప్రకటించిన ఆయన ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ రద్దు చేసి.. అంతకంటే మెరుగైన పెన్షన్ వచ్చేలా ప్రతి ఉద్యోగి ఉద్యోగ జీవితంలో చివరినెల వేతనంలో 50 శాతం మేర పెన్షన్ తీసుకునేలా గ్యారెంటీ పెన్షన్ స్కీంను తీసుకువచ్చారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో సంతోషం వ్యక్తమవుతోంది

సీపీఎస్ స్థానంలో జీపీఎస్

2004 సెప్టెంబర్ 1 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) వర్తించే పథకం రద్దు చేయాలని ఉద్యోగ సంఘాలు ఆందోళనలు చేస్తూ వస్తున్నాయి. పాలకులు మారినా.. ప్రభుత్వాల విధానాల్లో మార్పు లేదు. ఎందుకంటే భారీ ఎత్తున ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో అమలు చేసేందుకు ప్రభుత్వాలు ముందుకు రాలేదు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్‌పై గ్యారెంటీ లేక.. ఎంత వస్తుందో చెప్పలేని పరిస్థితులు ఉండేవి. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ మూడు రోజుల కిందట జరిగిన కేబినెట్ మీటింగ్‌లో సీపీఎస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో ఉద్యోగ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా సీపీఎస్ స్థానంలో అంతకంటే మెరుగైన గ్యారెంటీ పెన్షన్ స్కీంను (జీపీఎస్) తీసుకువచ్చారు. ఉద్యోగులు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నప్పటికీ.. ఆర్థికపరమైన ఇబ్బందులతోపాటు సాంకేతిక సమస్యల కారణంగా సాధ్యం కాదని తేల్చిన ప్రభుత్వం అంతకంటే మంచి ప్రయోజనాలు అందించేలా జీపీఎస్‌ను తీసుకు వస్తోంది. అయితే ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేయాలన్న లక్ష్యంతోనే గ్యారెంటీ పెన్షన్ స్కీం తీసుకువచ్చింది. ఈ స్కీం ద్వారా ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భద్రత చేకూరుతుంది. రిటైర్డ్ అయిన ఉద్యోగి చివరినెల మూల వేతనంలో 50 శాతం పెన్షన్, ప్రతి ఆరునెలలకు ఒకసారి కరువు భృతి ఇవ్వడం ద్వారా మెరుగైన పెన్షన్ లభించనుంది. ఇందులో సీపీఎస్‌లో చెల్లించినట్లే ఉద్యోగి 10 శాతం పెన్షన్ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం కూడా సమాన వాటా చెల్లిస్తుంది. ఉద్యోగ విరమణ సమయంలో చివరినెల జీతంలో బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా అందుతుంది. ఇక్కడ సీపీఎస్‌తో పోలిస్తే పెన్షన్ 150 శాతం అధికంగా ఉంటుంది. దీంతో పాటు ప్రతి యేడాది ఇచ్చే రెండు డీఏలతో కలిపి ఉద్యోగికి చక్కటి వేతనంలాంటి పెన్షన్ లభిస్తుంది. ఈ విధానం అమలు చేయడం ద్వారా పెద్దసంఖ్యలో ఉద్యోగులు ప్రయోజనం పొందనున్నారు.

ఉద్యోగులకు మేలు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తూ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. గతేడాది ప్రత్యేకంగా పీఆర్సీని అమలు చేయడం మొదలు కొని మళ్లీ ఈ ఏడాది పాత పీఆర్సీకి సంబంధించి కేబినెట్‌లో కమిటీ వేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించి రెగ్యులరైజేషన్‌ను వేగవంతంగా పూర్తి చేసేందుకు కసరత్తు చేయడంపై వేతన జీవులు సంబరాలు చేసుకుంటున్నారు. ఎక్కడికక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఎంత వీలైతే అంత మేలు చేయడానికి ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పడంతో అన్నిచోట్ల ఉద్యోగ వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

జీపీఎస్ పెన్షన్ పథకం లాభదాయకం



సీపీఎస్ స్థానంలో జీపీఎస్ పెన్షన్ పథకం తీసుకురావాలని ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఈ పథకంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ మినిమం గ్యారంటీగా నిర్ణయిస్తారు. -రాజారెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు, మదనపల్లె

జీపీఎస్‌తో మేలు



జీపీఎస్‌తో ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుంది. సీపీఎస్‌లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఎంత పెన్షన్ వస్తుందో తెలియదు. జీపీఎస్‌లో ఉద్యోగి విరమణ పొందిన చివరి నెలలో తీసుకున్న జీతానికి సగం పెన్షన్ కింద వస్తుంది. ఇది ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుంది.-విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు, నిమ్మనపల్లె

జీపీఎస్‌తో న్యాయం జరిగింది



జీపీఎస్‌తో ఉద్యోగులకు న్యాయం జరిగింది. పాత పెన్షన్‌కు సమానంగా ఉండేలా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయడం అభినందనీయం. సీఎంకు రుణపడి ఉంటాం. -కిల్లా నాగరాజ, ఉపాధ్యాయ సంఘం నాయకుడు

జీపీఎస్‌తో ఎంతో ప్రయోజనం



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేశారు. దాని స్థానంలో గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తీసుకొచ్చారు. ఇది సీపీఎస్ ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరమైనదనే చెప్పాలి. జీపీఎస్‌లో ఏడాదికి రెండు డీఏలు ఉంటాయి. అందువల్ల ప్రతి ఏడాది పెన్షన్ పెరుగుతుంది. -డాక్టర్ అశ్విన్, ఆకేపాడు పీహెచ్‌సీ, రాజంపేట మండలం

జీపీఎస్ తీసుకురావడం ఆనందదాయకం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీపీఎస్‌ను అమలులోకి తీసుకురావడం ఆనందదాయకం, ఉద్యోగుల సమస్యలను అలకించి వారికి బాసటగా ముఖ్యమంత్రి జగన్ నిలబడ్డారు. మేము ఎప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడతాం.
– ఎస్‌ఎండీ జక్రీయా బాషా, జిల్లా జనరల్ సెక్రటరీ , ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, చిన్నమండెం మండలం

సీఎం జగన్‌కు రుణ పడి ఉంటాం



ఉద్యోగుల సంక్షేమం కోసం జీపీఎస్ అమల్లోకి తీసుకువచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఇచ్చిన మాట తప్పని సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోనున్నారు.
-ఎస్.మునిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు, చిన్నమండెం మండలం

థ్యాంక్యూ సీఎం సార్



సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం చరిత్రాత్మకం అని కడప నగర్ మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులంతా థ్యాంక్యూ సీఎం సార్ అంటూ రాష్ట్రమంతటా నినాదాలు చేస్తున్నారన్నారు. శుక్రవారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులంతా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. థ్యాంక్యూ.. సీఎం సార్ అంటూ తమ కృతజ్ఞతలు కార్యక్రమానికి మేయర్ సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత 22 సంవత్సరాలలో ఏ ముఖ్యమంత్రి చేయలేని పని మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్నారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఇంకా మిగిలి ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లను కూడా రెగ్యులర్ చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత 12 శాతం ఉన్న హెచ్‌ఆర్‌ఏను 16 శాతం పెంచారన్నారు. రాష్ట్ర కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేత అరాచకం నుంచి కాపాడండి

కొల్లావారిపల్లి దళితుల మొర



మాట్లాడుతున్న కొల్లావారిపల్లి దళితులు

రాజంపేట రూరల్ : టీడీపీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు చేసే అరాచకాల నుంచి తమను కాపాడండి అంటూ కొల్లావారిపల్లి దళితులు మొర పెట్టుకున్నారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుబ్బనరసయ్య దళితులకు అన్యాయం చేస్తున్నాడంటూ కొల్లావారిపల్లికి చెందిన మణ్యం జయరామయ్య, మణ్యం ఈశ్వరయ్య, గుడిసే ఖబ్బరాయుడు, జి.సుబ్బరాయుడు నాయుడు, కతి నరసింహులు, గొంటి మణి, దాసరి పెంచలయ్యలు మండి పడ్డారు. కులాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటున్నాడన్నారు. కొల్లావారిపల్లి పంచాయతీ గోపమాంబపురం పొలంలోని సర్వే నంబరు. 20, 24 లో 3.50 ఎకరాల స్థలం ఉందన్నారు. జీవనాధారం కోసం తమకు ఇస్తే వ్యవసాయం చేసుకుంటామని 2011 జూన్ 3వ తేదీ సబ్ కలెక్టర్‌కు తాము అర్జీ సమర్పించామన్నారు. 2012 నవంబర్ 5వ తేదీ కడపలోని కలెక్టర్ కార్యాలయంలో డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని తిరిగి అర్జీ ఇచ్చామన్నారు. 2013 మే 13వ తేదీ తిరిగి ప్రజావాణిలో విన్నవించామని తెలిపారు. అయితే ఆ భూమిని శవన పీరయ్యనాయుడు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తుంటే అందుకు సుబ్బనరసయ్యనాయుడు సహకరిస్తున్నాడని ఆరోపించారు. గ్రామంలో 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వారికి నివాస స్థలం లేక పోవడంతో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. సర్వే నంబరు 386లో 32 మందికి గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 487 సర్వే నంబరులోని 39 సెంట్లు శ్మశాన వాటికకు మంజూరు చేశారన్నారు. జగనన్న కాలనీ పేరుతో మంజూరు చేసిన స్థల సరిహద్దులను చూపాలని కోరగా అక్కడికి వచ్చిన రెవెన్యూ అధికారులను సుబ్బనరసయ్యనాయుడు అనుచరులు అడ్డుకున్నారన్నారు. సుబ్బనరసయ్యనాయుడు ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేశారని పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర చేస్తున్న లోకేశ్ తమకు న్యాయం చేయాలని కోరారు. సుబ్బనరసయ్యనాయుడు కబ్జా చేసిన వంద ఎకరాల భూమిని దళితులకు ఇప్పించి ఆదుకోవాలని, సుబ్బనరసయ్యనాయుడు ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. లేని పక్షంలో తాము న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. లోకేశ్ నిజంగా దళితులకు న్యాయం చేసే వారైతే తమ సమస్యలు పరిష్కరించాలన్నారు.

జగనన్న విద్యాకానుక రెడీ



మండల స్టాకు పాయింట్ నుంచి పాఠశాలకు చేరిన జేవీకే కిట్లు

- బడి తెరిచిన రోజే కిట్లు పంపిణీ
- రవాణా, ప్యాకింగ్‌కు నిధులు మంజూరు

మదనపల్లె సిటీ: పాఠశాల విద్య బలోపేతానికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. బడి తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక కిట్లు అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్న దృష్ట్యా జిల్లాలోని 30 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లు అందజేతకు జిల్లా విద్యాశాఖ నిర్దిష్ట కార్యాచరణ సిద్ధం చేసింది. ఆయా మండలాల పరిధిలోని స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం పూర్తి చేశారు.

రెండు రోజుల్లో అన్ని పాఠశాలలకు జేవీకే కిట్లు చేరనున్నాయి. ఇందు కోసం విద్యాశాఖ రవాణా భత్యం, ప్యాకింగ్‌లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఆయా మండల స్టాకు పాయింట్ల నుంచి ప్రత్యేక వాహనాల్లో కిట్లను పాఠశాలలకు చేరవేశారు. కిట్ల ప్యాకింగ్‌కు అదనంగా నిధులు కేటాయించారు.

పాఠశాలలు తెరిచే నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం



సరఫరాదారుల నుంచి వచ్చిన జేవీకే కిట్లు ఆయా పాఠశాలలకు చేర్పుతున్నాం. ఇందుకు రవాణా, ప్యాకింగ్‌కు నిధులు కేటాయించాం. పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాం. – పురుషోత్తం, జిల్లా విద్యాశాఖాధికారి, అన్నమయ్య జిల్లా

జిల్లాలో వివరాలు ఇలా..

మండలం	విద్యార్థుల సంఖ్య	రవాణా, ప్యాకింగ్‌కు నిధులు (రూ.లక్షల్లో)
బి.కొత్తకోట	4955	44,865
చిన్నమండెం	3668	41,004
చిట్వేలి	4273	42,819
గాలివీడు	4989	44,967
గుర్రంకొండ	4278	42,834
కె.వి.పల్లి	4279	42,837
కలకడ	3520	40,560
కలికిరి	4387	43,161
కందూరు	7272	51,816
కురబలకోట	3787	41,361
లక్కిరెడ్డిపల్లె	3917	41,751
మదనపల్లె	16458	79,374
ములకలచెరువు	3815	41,445
నందలూరు	3747	41,241
నిమ్మనపల్లె	3256	39,768
ఓబులవారిపల్లె	4949	44,847
పెద్దమండ్యం	4107	42,321
పీటీఎం	3732	41,196
పెనగలూరు	4222	42,666
పీలేరు	6865	50,595
పుల్లంపేట	4038	42,114
రాజంపేట	8651	55,953
రామాపురం	3552	40,656
రామసముద్రం	5322	45,966
రాయచోటి	12204	66,612
సంబేపల్లి	4419	43,257
టి.సుండుపల్లి	4875	44,625
తంబళ్లపల్లె	3385	40,155
వాల్మీకిపురం	3981	41,943
వీరబల్లి	3886	41,658

స్థలం విలువ రూ.10 కోట్లు .. అద్దె రూపాయి మాత్రమే!

- 69 ఏళ్లుగా కొనసాగుతున్న రూపాయి అద్దె తంతు
- నోటీసులు ఇచ్చినా స్పందించని నిర్వాహకులు
- స్వాధీనం చేసుకోవాలని పురపాలక కౌన్సిల్ తీర్మానం



రాజంపేట పాతబస్టాండులో పురపాలక సంఘం స్థలంలో ఏర్పాటైన పెట్రోలు బంకు

రాజంపేట: దాదాపు రూ.10కోట్లు విలువ చేసే పురపాలక స్థలానికి నేటి అద్దె రూపాయే.. వినడానికి ఆశ్చర్యంగా ఉంది కదూ.. అవునండి నిజం .. ఇది ఎక్కడో కాదు.. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పట్టణంలోని పాతబస్టాండు నడిబొడ్డున తిరుపతి వైపు ఉన్న వంకదారి సత్యనారాయణ పెట్రోలు బంకు కథ.. కాస్ట్ ఆఫ్ లివింగ్ టౌన్‌గా పిలువబడే రాజంపేటలో ఇంటి బాడుగులు ఆకాశంలో ఉంటాయి. అలాంటిది ఏకంగా 19సెంట్ల స్థలానికి 69 ఏళ్లగా కొనసాగుతున్న రూపాయి అద్దె వ్యవహారం బట్టబయలైంది. ఈ విషయాన్ని పురపాలకసంఘం కౌన్సిల్ సీరియస్‌గా తీసుకుంది. ఈమేరకు శుక్రవారం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్‌లో ఈ పెట్రోలు బంకును స్వాధీనం చేసుకోవాలని తీర్మానం చేశారు.

లీజు వ్యవహారం ఇలా..

1954లో సర్వే నంబరు 961/ఏలో రాజంపేట పురపాలకసంఘం(అప్పట్లో మేజర్ పంచాయతీ)కి సంబంధించిన 19 సెంట్ల స్థలాన్ని వంకదారి సత్యనారాయణ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చారు. అప్పట్లో కేవలం రూపాయి అద్దెతో ఆ స్థలాన్ని కేటాయించారు. అయితే నేటి వరకు అలాగే కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో పెట్రోలు బంక్‌ను ఏర్పాటు చేశారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ లీజుకు తీసుకుంది. స్థలానికి సంబంధించి అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఆ అగ్రిమెంట్ కాలం ముగిసి కొన్ని సంవత్సరాలు అవుతోంది.

నోటీసులు ఇచ్చినా కానరాని స్పందన..

సుమారు 40 సంవత్సరాలుగా రూపాయి కూడా అద్దె చెల్లించకుండా ఉచితంగా పెట్రోలు బంకు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో చైర్మన్ పోలా రంగప్రవేశం చేశారు. కమిషనర్ జనార్ధన్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. వెంటనే స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇందుకు నిర్వాహకులు రెండు మాసాలు గడువు కోరారు. రెండు నెలలు పూర్తి అయినా పెట్రోలు బంకు నిర్వాహకులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. కేవలం రూపాయి అద్దెతో కోట్లు విలువ చేసే స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు తమ ఆధీనంలో ఉంచుకోవడంతో మున్సిపాలిటీ లక్షల రూపాయల ఆదాయాన్ని కోల్పోయింది.

పురపాలక స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం



పురపాలక సంఘం నిబంధనల మేరకు స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. ఆ విధంగానే కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. స్థలం నిర్వాహకులకు అనేక మార్లు నోటీసులు ఇచ్చారు. వారు ఏ మాత్రం స్పందించలేదు. పురపాలక సంఘం స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం వల్ల పరోక్షంగా ఆదాయ వనరులు పెంచుకునేందుకు వీలుంటుంది. -పోలా శ్రీనివాసులరెడ్డి, చైర్మన్, పురపాలక సంఘం, రాజంపేట

క్లుప్తంగా

పాముకాటుతో చిన్నారికి అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో చిన్నారి అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. మాలేపాడుకు చెందిన రైతు శ్రీనివాసులురెడ్డి కుమార్తె దేవసేనారెడ్డి(4) శుక్రవారం పొలం వద్దకు వెళ్లి ఆడుకుంటుండగా పాము కాటువేసింది. చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబసభ్యులు హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్సలకు తిరుపతికి రెఫర్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. ఈశ్వరమ్మకాలనీకి చెందిన ఎస్.ఖాదర్‌వలీ(45) కుటుంబసమస్యలతో ఇంట్లోనే బ్లీచింగ్ పౌడర్ నీళ్లలో కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నిమ్మనపల్లె : మండలపరిధిలోని ఆచార్లపల్లె గ్రామం వద్ద గురువారం రాత్రి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. చౌడేపల్లెకు చెందిన ట్రాక్టర్ యజమాని వేణుగోపాల్(35), ట్రాక్టర్ డ్రైవర్ చందు(29)లపై కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


దినేష్ మృతదేహం

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు కమ్మపల్లె దళితవాడ గ్రామం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గడియారం దినేష్(29) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు చిన్నఓరంపాడు బ్రహ్మణ కాలనీకి చెందిన దినేష్ పని నిమిత్తం ద్విచక్రవాహనంలోఓబులవారిపల్లెకు వచ్చాడు. తిరిగి ఇంటికి వస్తుండగా చిన్నఓరంపాడు కమ్మపల్లె వద్ద స్పీడ్ బ్రేకర్‌ను వేగంగా ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముక్కు నుంచి రక్తం వచ్చింది. స్థానికులు గమనించి కారులో రైల్వేకోడూరుకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు బెంగళూరులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంక వివాహం కాలేదు. మృతుడి తండ్రి గడియారం ప్రసాద్ స్వామి పౌరోహిత్యం చేస్తుండగా తల్లి గిరిజా అంగన్‌వాడీ టీచర్. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు పోలి పాపిరెడ్డి,జరుగు నారాయణరెడ్డి, స్థానిక నాయకులు దినేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

గోరంత అనుమతి..కొండంత తవ్వకం

- టీడీపీ నాయకుడి ఇష్టారాజ్యం
- గ్రానైట్ క్వారీలో యథేచ్ఛగా తవ్వకాలు
- అడ్డుకున్న ప్రజలు : ఆగిన పనులు
- పనులు శాశ్వతంగా నిలిపేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు


ప్రజలు అడ్డుకోవడంతో క్వారీలో నిల్వ ఉన్న గ్రానైట్ రాళ్లు

పెద్దతిప్పసముద్రం : ఒంగోలుకు చెందిన ఓ టీడీపీ నాయకుడి కనుసన్నల్లో మండలంలోని పులికల్లు పంచాయతీ గుడ్డంపల్లి సమీపంలో గ్రానైట్ క్వారీ నడుస్తోంది. గోరంత అనుమతితో చుట్టు పక్కల పొలాలను కొనుగోలు చేసి అనధికారికంగా కొండంత తవ్వకాలు చేపడుతున్నా గనుల శాఖ అధికారులు క్వారీ వైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. క్వారీ పేలుళ్ల శబ్దాలకు నివాసాలు ఉన్న గృహాలతో పాటు,బోరు బావుల్లోని పైపులు సైతం పూడుకు పోతున్నాయని ఆరోపిస్తూ తక్షణం పనులను నిలుపుదల చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ, మైన్స్ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళ కంటి మీద కునుకు లేకుండా జాగారం చేయాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. ఇదేమిటని క్వారీ నిర్వాహకులను ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అంతేగాక క్వారీపనులను అడ్డుకుంటున్నామని ఆరోపిస్తూ క్వారీ లీజుదారులు తమపై కోర్టులో తప్పుడు కేసు బనాయించారని ఉత్తన్న అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఒత్తిళ్ల కారణంగా తాత్కాలికంగా క్వారీ పనులను నిలిపేశారు. దీంతో నిర్వాహకుడు క్వారీలో నిల్వ ఉన్న రూ.లక్షల విలువ చేసే గ్రానైట్ రాళ్లను తొలగించేందుకు గుట్టుగా మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే క్వారీ పనులను శాశ్వతంగా నిలిపివేయాలని ప్రజలు పట్టుబడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

క్వారీ నిర్వాహకులు గ్రానైట్ నిక్షేపాలు ఉన్న స్థలాలను గుర్తించి రెండు, మూడు ఎకరాల భూమికి రాయల్టీ చెల్లించి ప్రభుత్వం నుంచి లీజు అనుమతి పొంది పక్కన ఉన్న స్థలాలను కూడా ఆక్రమించుకుని ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారని ప్రజల్లో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేగాక బ్లాస్టింగ్‌పై అనుభవం లేని వాళ్లు కూడా పేలుళ్లు పెడుతున్నారు. క్వారీని నిర్వహించే యాజమాన్యం సమీపంలోని పొలాలకు, గ్రామాలకు దూరంగా ఎకరం భూమిలో ప్లాంటేషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేగాక పక్క పొలాల్లోకి దుమ్ము, ధూళి , నివాస ప్రాంతాల్లో పేలుడు సంభవించినప్పుడు పేలుడు పదార్థాలు పడకుండా షెడ్డు నిర్మాణంతో పాటు డ్రిప్ పద్ధతిని అమలు చేయాలనే నింధనలు ఉన్నా లీజుదారులు వాటిని తుంగలో తొక్కేశారనే విమర్శలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రమే కావడంతో లీజుదారులు ఇష్టారాజ్యంగా గ్రానైట్ నిక్షేపాలను ఎల్లలు దాటిస్తున్నారు.

కలెక్టర్‌కు సమగ్రమైన నివేదిక అందజేస్తాం

గుడ్డంపల్లి సమీపంలోని క్వారీ నిలుపుదల విషయం నా దృష్టికి రావడమే గాక స్పందన కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు కూడా అర్జీ ఇచ్చారు. సదరు క్వారీకి ఎన్ని హెక్టార్లకు అనుమతి ఉంది, ఎన్ని హెక్టార్లలో తవ్వకాలు చేపట్టారు, గనుల శాఖ నింంధనలు పాటిస్తున్నారా, బ్లాస్టింగ్‌తో ఎక్కడైనా నష్టం వాటిల్లిందా సమగ్రంగా ఎన్‌ఓసీ రికార్డులను పరిశీలిస్తాం . కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం

– విద్యాసాగర్, తహసీల్దార్, పెద్దతిప్పసముద్రం

అగ్నిప్రమాదంలో పూరిగుడిసె దగ్ధం


కాలిపోయిన గృహోపకరణాలు

మదనపల్లె : అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై రూ.60వేల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఈ సంఘటన పట్టణంలోని దక్నీపేటలో శుక్రవారం ఉదయం జరిగింది. దక్నీపేటలో హనీఫ్‌కు చెందిన పూరిగుడిసెలో ఉదయం వంటచేసేందుకు కట్టెలపొయ్యిని వెలిగించే క్రమంలో మంటలు ఎగసి గుడిసెకు వ్యాపించాయి. ప్రమాదంలో గృహోపకరణాలు మంటల్లో కాలిపోయాయి. ఈ విషయాన్ని అగ్నిమాపకశాఖ వారికి తెలియజేశారు.వెంటనే అగ్నిమాపక అధికారి శివప్ప ఘటనాస్థలానికి చేరుకుని సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

విద్యుదాఘాతంతో వలంటీర్ దుర్మరణం


మృతి చెందిన జయచంద్ర

పెద్దతిప్పసముద్రం : కూలిపనికి వెళ్లిన వలంటీర్ విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు..మండలంలోని టి.సదుంలో తలారీ జయచంద్ర (25) వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. టి.సదుం సమీపంలోని అనంతాపురంకు చెందిన రైతు కృష్ణమూర్తి వ్యవసాయ పొలంలో నేరేడు వృక్షాలు ఉన్నాయి. నేరేడు కాయలను కోసేందుకు జయచంద్ర, కే.శ్రీనాథ్, ఎం.నాగరాజు కూలిపనికి వెళ్లారు. జయచంద్ర చెట్టుపైకి వెళ్లి నేరేడు కాయలు కోస్తుండగా చెట్టుపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తలగడంతో షాక్‌కు గురై కిందకు పడిపోయాడు. అక్కడే ఉన్న శ్రీనాథ్, నాగరాజులు వైద్యం కోసం కారులో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి సోదరుడు టి.విజయకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా జయచంద్రకు ఏడాది క్రితమే సునీతతో వివాహమైంది. వీరికి రెండునెలల వయసున్న కుమారుడు ఉన్నాడు. జయచంద్ర మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

అదుపుతప్పి..వాహనాలపైకి దూసుకెళ్లి..

- గువ్వలచెరువు ఘాట్‌లో ప్రమాదం
- కార్లు, బైక్‌పై పడిన పాలవ్యాన్
- ఒకరి మృతి, నలుగురికి తీవ్ర గాయాలు


కార్లపై బోల్తా పడిన పాల వ్యాన్


సుజన మృతదేహం


గాయపడిన బాలాజీ రెడ్డి

చింతకొమ్మదిన్నె : కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో గల నాలుమలుపు వద్ద శుక్రవారం పాలవ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుజన (59) అనే మహిళ మృతిచెందింది. ఆర్టీసీ బస్సును ఢీకొని ఒక్కసారిగా పల్టీ కొట్టి రెండు కార్లతో పాటు, ఒక ద్విచక్ర వాహనంపై పడింది. దీంతో కార్లు, బైక్ నుజ్జు నుజ్జు అయ్యాయి. సీకేదిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి కథనం మేరకు రాయచోటి నుంచి కడపకు వస్తున్న పాల వ్యాన్ ఘాట్ రోడ్డులోని నాలు మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి ఆర్టీసీ బస్సును వెనుకవైపు నుంచి ఢీకొంది. ఒక్కసారిగా పల్టీకొట్టింది. కడప నుంచి రాయచోటికి వెళ్తున్న రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనంపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సుజన మృతి చెందగా రవి చంద్ర, శ్రియ, ద్విచక్ర వాహనంలో వెళుతున్న బాలాజీరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు.విషయం తెలుసుకున్న చింతకొమ్మదిన్నె ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని 108లో చికిత్స రిమ్స్‌కు తరలించారు. గువ్వల చెరువు ఘాట్ రోడ్డులోని నాలుగో మలుపు వద్ద వాహనాలు రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాలు పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఒక్కటైన ఆంధ్ర అబ్బాయి, ఒడిశా అమ్మాయి


నూతన వధూవరులు రాజ్ లక్ష్మీ, విష్ణువర్ధన్‌రెడ్డి

రాజుపాళెం : ఆంధ్ర అబ్బాయి, ఒడిశా అమ్మాయి ఇద్దరు ఒక్కటైన సంఘటన రాజుపాళెం మండలం వెల్లాల గ్రామంలోని సీతారాముల కల్యాణ మండపంలో జరిగింది. ఇదే మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి సోదరుడు బుక్కసముద్రం విష్ణువర్ధన్‌రెడ్డి గత 15 ఏళ్లుగా ఒడిశా రాష్ట్రంలోని పోరాపుట్ జిల్లాలో ఉన్నాడు. ఈ క్రమంలో గత మార్చిలో పోరాపుట్ జిల్లాలోని జయపురం మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందాడు. శుక్రవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రొఫెసర్ రాజ్‌లక్ష్మిని విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లాల సీతారామల కల్యాణ మంపడంలో వివాహం చేసుకున్నాడు. వధూవరులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎసార్‌సీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రవల్లిక, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆశీర్వదించారు.

'జగనన్నకు చెబుదాం'కు స్పందన

బి.కొత్తకోటలో మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


బి.కొత్తకోటలో సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్లు

బి.కొత్తకోట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాంకు అందిన ఫిర్యాదుపై శుక్రవారం మదనపల్లె ఎస్‌ఈబీ సీఐ పి.శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో ఇసుక తరలింపుపై బి.కొత్తకోటలో దాడులు నిర్వహించారు. మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసి స్థానిక పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు. వివరాలు..ఈనెల ఆరోతేదీన బి.కొత్తకోట నుంచి ఓ వ్యక్తి ఆలేరువాగు పక్కనే ఉన్న పట్టా భూమిలోని ఇసుకను ఖాదర్‌బాషా అనే వ్యక్తి విక్రయించుకుంటున్నాడని, వర్షాలు, వాగు ప్రవాహ సమయంలో పక్కనే ఉన్న వ్యవసాయ భూములకు నష్టంవాటిల్లుతుందని జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు చేశారు. ఏడో తేదీ ఫిర్యాదు వివరాలు మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్‌కు చేరాయి. దీనిపై సమీక్షించిన సీఐ శ్రీహరిరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు హరికుమార్, మునిరామయ్య, కానిస్టేబుల్ దామోదర్‌లతో కలిసి ఫిర్యాదుదారున్ని కలిసి విచారించారు. అనంతరం ఆలేటివాగు వద్ద దాడులు నిర్వహించి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఇసుక ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు, దీనికి సంబంధించిన అనుమతులు ఉన్నాయా అని డ్రైవర్లను విచారించారు. ఎలాంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఏఎస్‌ఐ బొజ్జేనాయక్ మూడు ట్రాక్టర్లకు చెందిన డ్రైవర్లు బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన హరికృష్ణ (38), దాసు (40), పీటీఎం మండలం మల్లెలకు చెందిన భాస్కర్ (28)లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీహరిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బి.కొత్తకోటకు చెందిన ఖాదర్‌బాషా పట్టాభూమిలోని ఇసుకను ట్రాక్టర్‌కు రూ.700కు విక్రయిస్తున్నట్టు నిర్ధారించామని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సిఫార్సు చేస్తున్నట్టు చెప్పారు. కాగా ప్రజలు తమ నిర్మాణాల కోసం ప్రభుత్వం అధికారికంగా అనుమతులిచ్చి ఇసుక క్వారీల నుంచి నాణ్యమైన ఇసుకను కొనుగోలు చేయాలని సూచించారు.

చైల్డ్ పోర్నోగ్రఫీ నిందితుడు అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ సురేష్

కలికిరి : చైల్డ్ పోర్నోగ్రఫీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వాల్మీకిపురం సీఐ బీఎన్ సురేష్ కథనం మేరకు... 18 సంవత్సరాల లోపు వయస్సు గల అమ్మాయిలు, అబ్బాయిలు కొన్ని అశ్లీల వీడియాలను చూసిన, ఇతరులకు పంపిన సమాచారంపై నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎంక్స్‌ప్లెయిటెడ్ చిల్డ్రన్(ఎన్‌సీఎంఈసీ) వారి నుంచి అందిన సమాచారం మేరకు అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆదేశాలతో మే నెల 2న కలికిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కలికిరి పట్టణ పరిధిలోని గిరిజన కాలనికి చెందిన బండి బాలాజీ(27)ని నిందితుడుగా గుర్తించిన పోలీసులు శుక్రవారం సాయంత్రం మండలంలోని మేడికుర్తి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని జుడీషియల్ కస్టడీకి తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కేసులో చురుగ్గా వ్యవహరించిన సీఐ, ఏఎస్‌ఐ మధుసూదనాచారి, హెడ్‌కానిస్టేబుల్ మనోహర్, పీసీలు మునిరత్నం, రామాంజులు, సతీష్, అమరనాథ్, హోంగార్డు నిజాముద్దీన్‌లను ఎస్పీ, డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రహీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని వైఎస్సార్ లే అవుట్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో సూరి (30) అనే వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. చిన్నచౌకు సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు కథనం మేరకు..తిలక్‌నగర్‌కు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంలో వైఎస్సార్ లే అవుట్ వైపునకు బయలుదేరారు. ఈక్రమంలో ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయారు.బైక్‌లో నుంచి ఒకరు కిందపడ్డాడు. లారీ వెనుక టైరు మీద వెళ్లడంతో సూరి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.వీరి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి పడి వ్యక్తికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు శుక్రవారం కర్ణాటకలోని బళ్లారి నుంచి హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో అతను తిరుపతికి వెళుతున్నాడు.ఓబుళాపురం వద్ద రైలు నుంచి పడిపోవడంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు.గాయపడిన వ్యక్తి పేరు కార్తీక్ అని, ఇతనికి 28 సంవత్సరాల వయసు ఉంటుందని తెలిపారు. క్షతగాత్రున్ని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

కేంద్ర సాఫ్ట్‌వేర్‌తో అలవెన్స్‌లకు బ్రేక్

తట్ట బుట్ట, గడ్డ పార చార్జీలు కట్


ఉపాధి పనులను చేస్తున్న కూలీలు

వల్లూరు : కూలీలకు కోరిన సమయంలో పనులు కల్పిస్తూ ఆదుకుంటూ వచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలులో ఉన్న రాష్ట్ర సాఫ్ట్‌వేర్ స్థానంలో కేంద్ర సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. ఫలితంగా పథకం ప్రారంభం నుంచి కూలీలకు ఇస్తూ వచ్చిన పలు అలవెన్స్‌లకు బ్రేక్ పడింది.ముఖ్యంగా వేసవి అలవెన్స్, తట్ట , బుట్ట, గడ్డ పార చార్జీ, తాగు నీటి అలవెన్స్, మేట్ చార్జీ మొదలైనవి నిలిచిపోయాయి. దీంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర కాలాలతో పోలిస్తే వేసవిలో ఉపాధి హామీ కూలీలు వేడిని తట్టుకొని పని చేయాల్సి ఉంటుంది. ఫలితంగా పని కూడా తగ్గుతుంది. అయినా సాధారణ పని దినాల్లో వచ్చిన వేతనానికి తగ్గకుండా కూలీలు పొందేలా ప్రతి సంవత్సరం వేసవి ప్రారంభం నుంచి ముగిసే వరకు అదనపు కూలీని చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసేది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి మాసం నుంచి జూన్ చివరి వరకు అదనపు కూలీ రేట్లు వర్తించే విధంగా వేసవి ప్రారంభంలో ఉత్తర్వులు జారీ చేసేది. వేసవి డ్రై అలవెన్స్ రూపంలో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి నెలలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం , జూన్ మాసంలో 20 శాతం అదనంగా వేతనం చెల్లించేది. కూలీలు ఈ నెలల్లో సూచించిన మేర శాతం తక్కువగా పని చేసినప్పటికీ పూర్తి స్థాయిలో కూలీని పొందడానికి అవకాశం కలిగేది. వ్యవసాయ పనులు అరకొరగా ఉండే వేసవిలో ఈ అదనపు అలవెన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చేవారు. దీంతో రోజు రోజుకూ కూలీల సంఖ్య పెరిగేది.

కేంద్ర సాఫ్ట్‌వేరే కారణం

గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు చెందిన కార్యకలాపాలు నిర్వహించేవారు. ఇందులో గుర్తించిన పనులకు సంబంధించి వివరాలను అప్‌లోడ్ చేసి ఎస్టిమేషన్‌ను జనరేట్ చేసేవారు. ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా మన రాష్ట్రంలోని పరిస్థితులను బట్టి పథకం కింద పనులు చేపట్టే వారు. రాష్ట్రంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక అలవెన్స్‌లు చెల్లించేది. కేంద్ర ప్రభుత్వం 2021 నవంబర్ నుంచి దేశ వ్యాప్తంగా ఒకే సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్‌ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.అన్ని రాష్ట్రాలు తప్పని సరిగా ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా పథకం కార్యకలాపాలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో వేసవి అలవెన్స్‌లు ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. ఇది కూలీల పాలిట ఆశనిపాతంగా మారింది. వీటితో బాటు గతంలో పని ముట్ల వాడకానికి ఒక్కో కూలికి రోజుకు రూ 5 చొప్పున ఇచ్చే తట్ట, బుట్ట చార్జీలు, రోజుకు రూ 15 చొప్పున ఇచ్చే గడ్డ పార చార్జీలు సైతం నిలిచి పోయాయి. గ్రూపు మేట్‌కు ఆ రోజు పని చేసిన కూలీలను బట్టి ఒక్కో కూలికి రూ 3 చొప్పున మేట్ చార్జీ ఇచ్చే వారు. అది కూడా నిలిచి పోయింది. వేసవిలో దాహం తీర్చుకోవడానికి ఒక్కో కూలికి తాగునీటికి రోజుకు రూ 5 చొప్పున చెల్లించే వారు. మిగిలిన కాలంలో రోజుకు రూ 2.50 ఇచ్చేవారు. ఇవి కూడా ప్రస్తుతం పూర్తిగా నిలిచి పోయాయి. కాగా గతంలో కూలీల నివాసం ప్రాంతం నుంచి పని ప్రదేశానికి ఇచ్చే రవాణా చార్జీని మాత్రం కొనసాగిస్తున్నారు.

మేట్ చార్జీలు రావడంలేదు



నేను ప్రతి రోజు పని ప్రదేశంలో గ్రూపు సభ్యుల హాజరును నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత ఆరోజు వచ్చిన కూలీల సంఖ్యను బట్టి గరిష్ట వేతనం పడడానికి చేయాల్సిన పనిని మార్కింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. అధికారులు కొలతలు తీయడానికి పని ప్రదేశానికి వచ్చినపుడు అందుబాటులో ఉండాలి. గతంలో మేట్ చార్జీలు ఇచ్చేవారు. కొంత ఉపశమనంగా ఉండేది. ప్రస్తుతం రావడం లేదు.

– వీరయ్య, ఉపాధి మేట్, తొల్లగంగనపల్లె

తాగునీటి చార్జీలు నిలిచిపోయాయి



గతంలో ఇచ్చే తట్ట, బుట్ట, గడ్డ పార చార్జీలు, తాగు నీటి చార్జీలు కూడా ఇవ్వడం లేదు. అధికారులను అడిగితే ప్రస్తుతం అవి నిలిచి పోయాయని అంటున్నారు.

– సరోజ, ఉపాధి హామీ కూలీ, కుమారునిపల్లె.

వేసవి అలవెన్స్‌లు ఇవ్వాలి



గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ మాసం వరకు వేసవి అలవెన్స్‌లను ఇచ్చే వారు. ఎండా కాలం వేడి వల్ల పనులు కొంత తక్కువగా చేసినా కూలీ డబ్బు మాత్రం బాగానే వచ్చేది. ఇప్పుడు వేసవి అలవెన్స్‌లు లేక పోవడంతో తక్కువ కూలీ పడుతోంది. అధికారులు స్పందించి వేసవి అలవెన్స్‌లను కొనసాగించాలి.

– బి. బాలయ్య, ఉపాధి హామీ కూలీ, కుమారునిపల్లె